# కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు..



రోడ్ షోలో ఓట్లు అభ్యర్థిస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

- ఇక ఆ పార్టీ వాళ్లు ప్రజలకు ఇచ్చే హామీలకు గ్యారెంటీ ఏముంటుంది?
- దేశాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది
- 11 సార్లు అవకాశమిచ్చినా ప్రజలకు పావలావంతూ మేలు చేయలేదు
- ఖమ్మం నగర ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 26: అటు దేశంలోగానీ, ఇటు రాష్ట్రంలోగానీ అసలు కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. అలాంటి ఆ పార్టీ నేతలు ఇక ప్రజలకేం గ్యారెంటీలిస్తారని ఎద్దేవాచేశారు. దేశాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. ప్రజలు 11 సార్లు అవకాశం ఇచ్చినా వారికి పావలావంతు కూడా మేలు జరగలేదని ధ్వజమెత్తారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు తాము అభివృద్ధి చేస్తామంటూ ముందుకు వస్తుండడం విడ్డూరంగా విమర్శించారు. గత 11 పర్యాయాల్లో చేయని అభివృద్ధిని ఇప్పుడెలా చేస్తారంటూ ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలో ఆదివారం పర్యటించిన ఆయన.. 4, 5, 6 డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోల్లో మాట్లాడారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. అందులో భాగంగానే నేడు తెలంగాణను అభివృద్ధిలో దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనతను సొంతం చేసుకుందని అన్నారు. అటు సంక్షేమంలో కూడా అన్ని రాష్ట్రాల్లోకెల్లా తెలంగాణ మొదటి స్థానమని అన్నారు. అందుకే ఇక్కడి పథకాలు తమకూ కావాలంటూ పొరుగు రాష్ట్రాల ప్రజలు కూడా అక్కడి ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారని అన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.200 చొప్పున ఇస్తే ఇప్పుడు సీఎం కేసీఆర్ వాటిని రూ.2016, రూ.4016గా ఇస్తున్నారని గుర్తుచేశారు. ఇన్నేళ్లలో ఇలాంటి పింఛన్లను కాంగ్రెస్ ఎందుకు ఇవ్వలేకపోయిందని ప్రశ్నించారు. అలాగే, స్థానికేతరుల వల్ల నియోజకవర్గానికి ఉపయోగం ఏమీలేదని అన్నారు. ఇక్కడి ప్రజల అవసరాలు, కష్టాలు తెలిసిన తన వల్లనే ఖమ్మం ఇంతలా అభివృద్ధి చెందిందని స్పష్టం చేశారు. అయితే, ఖమ్మం అభివృద్ధి అతడి వల్లనేనని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకుంటుండడం సిగ్గుచేటని అన్నారు. ఇక్కడి అభివృద్ధిని తుమ్మల చేసి ఉంటే అందుకు నిధులు ఇచ్చింది సోనియాగాంధీనా? అని ప్రశ్నించారు. 30న జరిగే ఎన్నికల్లో తనకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు.

## మభ్యపెట్టేందుకే ఆరు గ్యారెంటీ స్కీములు

- కాంగ్రెస్ ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే నియోజకవర్గమంతా దళితబంధు
- పెనుబల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటవీరయ్య



బయ్యన్నగూడెంలో మాట్లాడుతున్న సండ్ర

పెనుబల్లి, నవంబర్ 26 : ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీములంటూ ఊదరగొడుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఆ పార్టీ ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ వారిలో ఒకరిగా ఉంటున్న తనకు వారే బలమూ, బలగమని స్పష్టం చేశారు. పెనుబల్లి మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన.. బయ్యన్నగూడెం, తుమ్మలపల్లి, పాతకుప్పెనగుంట్ల, కొత్తకుప్పెనకుంట్ల గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి గ్యారెంటీ స్కీములన్నీ గడిచిన 50 ఏళ్లుగా ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలించిన ఇన్నేళ్లలో గ్రామాల్లో కనీసం మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. ఇక సంక్షేమ పథకాల ఊసేలేదని అన్నారు. కానీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలకు అద్భుతమైన సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు పథకం అమలవుతుందని స్పష్టం చేశారు. నూతన మ్యానిఫెస్టో ప్రకారం మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తామని వివరించారు. అందుకని ప్రజలందరూ కేసీఆర్ వెంటే ఉండాలని పిలుపునిచ్చారు. పొరపాటున కాంగ్రెస్‌ను కనికరిస్తే కరెంట్ మోటర్ల వద్ద కాపలా పడుకునే రోజులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా కాంగ్రెస్ నాయకులు ఇక్కడ ఇస్తున్న హామీలను వాళ్లు అధికారంలో ఉన్న చోట ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కనగాల వెంకట్రావు, లక్కినేని అలేఖ్య, చెక్కిలాల మోహన్‌రావు, చింతనిప్పు కృష్ణచైతన్య, కోమటి శ్రీలత, మందడపు అశోక్‌కుమార్, ఆళ్ల అప్పారావు, కోమటి ప్రసాద్, మామిడి మైసయ్య, ఆవిటి మారేశ్వరరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, కొత్తగుంట్ల అప్పారావు, తాళ్లూరి శేఖర్‌రావు, లగడపాటి శ్రీను, సూరపురెడ్డి కిరణ్‌రెడ్డి, నర్వోత్తమరెడ్డి, నాగండ్ల నరసింహారావు, దొడ్డపునేని రవి, కొప్పుల రంగారావు, చెక్కిలాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## చుట్టపు చూపుగా వచ్చే 'భట్టి' మనకొద్దు

- మూడుసార్లు గెలిచినా.. విక్రమార్క చేసిన అభివృద్ధి శూన్యం
- బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత ప్రగతి తథ్యం
- బోనకల్లు మండల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు



హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

బోనకల్లు, నవంబర్ 26 : నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్క మళ్లీ మనకొద్దని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. ఆయన వల్ల మన నియోజకవర్గానికి పైసా ఉపయోగం లేదని, ఆయన ఇక్కడి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి శూన్యమని విమర్శించారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత ప్రగతి తథ్యమని స్పష్టం చేశారు. బోనకల్లు మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన.. ముష్టికుంట్ల గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ఆయనకు బొట్టు పెట్టి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. అందుకోసం మధిర నియోజకవర్గం నుంచి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. నిత్యం నియోజకవర్గంలోనే ఉంటుంటున్న తాను ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో తోడునీడగా నిలుస్తున్నానని గుర్తుచేశారు. ఇక్కడి నుంచి గెలిచిన భట్టి విక్రమార్క.. కేవలం ఓట్ల సమయంలో తప్ప మరెప్పుడు ఈ నియోజకవర్గంలో కన్పించడని, గడిచిన మూడు ఎన్నికల్లో ఎప్పుడు గెలిచినా తదుపరి ఎన్నికలప్పుడే ఆయన ఇక్కడికి వస్తాయరని విమర్శించారు. అభ్యర్థి కమల్‌రాజు కుమార్తె అభిజ్ఞ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, మోదుగుల నాగేశ్వరరావు, షేక్ బీజాన్‌బీ, షేక్ హుస్సేన్, పండుగ సీతారాములు, షేక్ రఫీ, షేక్ నజీర్, ధారగాని నాగేశ్వరరావు, చల్ది ప్రసాద్, నాగేశ్వరరావు, రుక్సానాబేగం, ధారగాని వెంకటరమణ, దొడ్డా నాగేశ్వరరావు, దొప్పా కృష్ణ, షేక్ రఫీ పాల్గొన్నారు.

# అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

నియోజకవర్గంలో జరిగిన పనులే ఇందుకు నిదర్శనం

మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తాం

వైరా ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

వైరా టౌన్, నవంబర్ 26: అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని తేల్చిచెప్పారు. తమను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. వైరా మున్సిపాలిటీలో ఆదివారం పర్యటించిన ఆయన.. 5, 6, 12, 13, 14, 15, 16, 17, 18, 19, 20 వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వార్డులోనూ మదన్‌లాల్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళహారతులతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో ఎంతటి అభివృద్ధి జరిగిందో ప్రజలు చూస్తూనే ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని అన్నారు. 24 గంటల కరెంటు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు వంటి అద్భుతమైన పథకాలను ప్రజల్లో ఎంతో ఆదరణ ఉందని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తే నూతన మ్యానిఫెస్టో ప్రకారం అన్ని వర్గాల ప్రజలకూ మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఇన్నేళ్లూ స్థానికంగానే ఉంటూ ఇక్కడి ప్రజల కష్ట సుఖాల్లో తోడునీడగా నిలిచిన తనను ఈ ఎన్నికల్లో ఆదరించాలని, కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం సుభిక్షం

ఓటు వేసే ముందు ప్రజలు ఒకటికి పదిసార్లు ఆలోచించాలి

ప్రజాస్వామ్యంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు తావులేదు

ఖమ్మం రూరల్ ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ

ఖమ్మం రూరల్, నవంబర్ 26: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ స్వాప్నికుడు, బంగారు తెలంగాణ నిర్మాత సీఎం కేసీఆరే రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన.. గుదిమళ్ల, వెంకటగిరి, గుర్రాలపాడు గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో మాట్లాడారు. సుదీర్ఘకాలం ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన కేసీఆర్.. అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధిలో తీర్చిదిద్దారని అన్నారు. కేవలం పదేళ్ల కాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. అద్భుతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకూ వాటి ఫలాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలందరూ తోడుగా ఉండాలని కోరారు. అందుకని ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీని అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కుటుంబానికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ఓటు వేసే ముందు ప్రజలు ఒకటికి పదిసార్లు ఆలోచించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గమనించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు తావులేదని, అయినప్పటికీ కొందరు వ్యక్తులు అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కాగా, అన్ని గ్రామాల్లోనూ ఎమ్మెల్యే కందాళ ప్రజలు బ్రహ్మరథం పెట్టారు. పూలమాలలు, గజమాలలతో సత్కరించారు. బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ సమన్వయకర్తలు తాళ్లూరి జీవన్‌కుమార్, బానోత్ చంద్రావతి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, యండపల్లి వరప్రసాద్, పేరం వెంకటేశ్వర్లు, మెర్రిమేకల నాగేశ్వరరావు, బుర్రి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.




వెంకటగిరిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ